
హుజూరాబాద్‌టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈవో పమేలా సత్పతి

హుజూరాబాద్‌టౌన్: డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలిపోతున్న ఉద్యోగులు

వీణవంక: నర్సింగాపూర్ గ్రామంలో పోలింగ్‌కు సిద్ధం చేసిన ఉమెన్ మోడల్ పోలింగ్ స్టేషన్

పోలింగ్‌కు అంతా రెడీ

- జిల్లా వ్యాప్తంగా 2,194 పోలింగ్ కేంద్రాలు
- ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు
- అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు
- పర్యవేక్షించిన అధికారులు

కలెక్టరేట్/ హుజూరాబాద్ టౌన్/వీణవంక/ మానకొండూర్ రూరల్/ చిగురుమామిడి/ కరీంనగర్ రూరల్, మే 12: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నేడు పోలింగ్ జరుగనుండగా, ఇందుకోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని 2,194 పోలింగ్ కేంద్రాలు వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయడంతో పాటు ఎండల తీవ్రత దృష్ట్యా ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించింది. కాగా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకే కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు.

నగరంలోని ఎస్సారార్, మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూలర్లు, విద్యుత్తు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు తీసుకుని జాగ్రత్తగా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదని, సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా నగరంలోని స్ట్రాంగ్ రూములకు తరలించాలని కోరారు. డీఈవోతో పాటు కరీంనగర్ పార్లమెంటు సాధారణ ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా పాల్గొన్నారు. వీరి వెంట అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, ఇతర అధికారులు ఉన్నారు.

కరీంనగర్‌లో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.మహేశ్వర్


హుజూరాబాద్‌టౌన్: ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలేందుకు సిద్ధమవుతున్న పోలింగ్ సిబ్బంది

హుజూరాబాద్ నియోజకవర్గంలోని మొత్తం 305 పోలింగ్ స్టేషన్లకు ఆదివారం సాయంత్రంలోగా ఈవీఎంలు చేరేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,50,0429 మంది (పురుషులు 1,21,809 మంది, మహిళలు 1,28,613 మంది), ఇతరులు ఏడుగురు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 1525 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో రమేశ్‌బాబు తెలిపారు. కాగా, పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పరిశీలించారు. అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ హుజూరాబాద్ నోడల్ అధికారి కే విజయ్‌కుమార్, ఈవీఎంల నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐలు బీ రమేశ్, కే రవి, వెంకటేశ్వర్లు, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వీణవంక మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీల పరిధిలో 42,514 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 55 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 220 మంది సిబ్బందిని నియమించారు. ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు.

మానకొండూర్ మండల పరిధిలో 78 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటి వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మానకొండూర్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి సీహెచ్ రాజు తెలిపారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని మానకొండూర్ సీఐ రాజ్ కుమార్ సూచించారు.

చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో గల 40 పోలింగ్ బూత్‌లను ఆదివారం ఎన్నికల బందోబస్తు ఇన్‌చార్జి సీఐ బిల్ల కోటేశ్వర్ ఎస్ఐ బండి రాజేశ్‌తో కలిసి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా మద్యం, డబ్బులు పంచితే కేసు నమోదు చేస్తామని సీఐ కోటేశ్వర్ హెచ్చరించారు.

కరీంనగర్ మండలంలో 55,011 మంది ఓటర్లకు గానూ 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నగునూర్, గుంటూర్‌పల్లిలో మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. వాటిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. నగునూర్, గుంటూర్‌పల్లి పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లతో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

నగరంలో ఎన్నికల సామగ్రితో బస్సులో తరలివెళ్తున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది

ఎన్నికల విధులు నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

నగరం నుంచి ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు

పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన

రాంనగర్, మే 12 : ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలని సీపీ అభిషేక్ మొహంతి సూచించారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిరిసిల్ల బైపాస్ రోడ్డులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సీపీ ఆదివారం పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు వచ్చిన పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల రోజు నిర్వహించే విధులకు సంబంధించి సూచనలు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సత్ప్రవర్తనతో మెదలాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులకు తెలపాలని సూచించారు. అలాగే కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం సీపీ స్వయంగా పరిశీలించారు. హుజూరాబాద్, తిమ్మాపూర్, సైదాపూర్ మండలం వెన్నంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్ జిల్లా పరిషత్ పాఠశాల, కరీంనగర్ గణేశ్‌నగర్‌లో గల ఓయాసిస్ స్కూల్, త్రీ టౌన్ పరిధిలోని కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు పలు ఇతర పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

హుజూరాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలీసు సిబ్బందికి ఎన్నికల విధులపై సూచనలు చేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

మనసు ఏకాగ్రం.. లక్ష్యం సాఫల్యం

- సత్ఫలితాలనిస్తున్న శ్రీరామచంద్ర మిషన్ 'బ్రైటర్ మైండ్స్'కార్యక్రమం
- ప్రత్యేక శిక్షణతో విద్యార్థుల్లో రెట్టింపవుతున్న ఆత్మవిశ్వాసం
- ఏటా వేసవిలో కొనసాగుతున్న పది రోజుల ప్రోగ్రాం

మెదడు మనిషిలోని గొప్ప అవయవం.. జ్ఞానేంద్రియాలకు ముఖ్యమైన కేంద్రం. దాని సామర్థ్యాన్ని పెంచుకుంటే వ్యక్తి జీవనం, భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది. ఇందుకోసం ఉద్దేశించిందే 'బ్రైటర్ మైండ్స్'. శ్రీరామచంద్ర మిషన్ ద్వారా ఏటా యోగ, ధ్యానం ద్వారా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం పిల్లల్లో మానసిక శక్తి సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడుతున్నది. ఇందులో భాగంగా కండ్లతో చూడకుండానే పేపర్‌పై చిత్రాన్ని గుర్తించడం.. శబ్దం ఆధారంగా వస్తువును తెలుసుకోవడం.. కేవలం వాసన, స్పర్శతో రంగులను కనిపెట్టడం లాంటి విభిన్న ప్రక్రియలపై పట్టు సాధించిన వారిలో ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చనే ఆత్మవిశ్వాసం రెట్టింపవుతున్నది.

-కమాన్‌చౌరస్తా, మే 12

వెంకటేశ్ ఆధ్వర్యంలో సాధన చేస్తున్న చిన్నారులు

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో బ్రైటర్ మైండ్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న చిన్నారులను గుర్తించి, పది రోజుల్లో భవిష్యత్తుకు సరిపడా శిక్షణ ఇచ్చి పంపుతున్నారు. నేడు విస్తరించిన సామాజిక మాధ్యమాలు, ఫోన్లు, టీవీ ప్రభావంతో మనిషి మెదడుపై ఏర్పడే తీవ్ర ఒత్తిడిని ఎలా నియంత్రించుకోవాలో నేర్పుతూ, పోటీ ప్రపంచంలో రాణించేలా చిన్నతనం నుంచే బంగారు బాటలు వేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా బద్దకం, మొండితనం, భయం, మొహమాటం, కోపం లాంటి భావోద్వేగాలను అధిగమించి లక్ష్యాన్ని సాధించేందుకు ఈ ప్రత్యేక తరగతులు ఎంతో ఉపకరిస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు.

శిక్షణ ప్రత్యేకం.. ప్రదర్శన అబ్బురం

సాధారణంగా అంధులు స్పర్శ ద్వారా వస్తువులను గుర్తిస్తారు. అయితే బ్రైటర్ మైండ్స్ శిక్షణ పొందిన విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని కేవలం వాసన, వినికిడి, స్పర్శ ద్వారా రంగులు, వస్తువులు గుర్తించడం, చిత్రాలు వేయడం, సింగిల్, డబుల్ డిజిట్ నంబర్లు గుర్తించడం, ఆకారాలను వేర్వేరుగా పెట్టడం, రాసిచ్చిన అక్షరాలు చదవడం లాంటివి సులువుగా చేయగలుగుతారు. మెదడుకు వ్యాయామం, ప్రాణాయామం, యోగా, జ్ఞాపక శక్తి పెంచుకునే మెళకువలను వివరిస్తూ శాస్త్రీయ పద్ధతుల ద్వారా విద్యార్థులకు ఆయా అంశాల్లో తర్ఫీదు ఇస్తారు.

శిక్షణ కొత్తగా ఉంది..

క్లాస్‌లకు ఆసక్తిగా ఎంతో హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న. ఇక్కడ తెలియని చాలా విషయాలు నేర్పించారు. సెల్‌ఫోన్, టీవీకి దూరంగా ఉంటూ, ప్రతి రోజూ మనం లేచింది మొదలు, పడుకునే వరకు ప్రతి విషయాన్ని కొత్తగా ఈ శిక్షణలో నేర్పించారు. చాలా కొత్త విషయాలు తెలిశాయి. మా పేరెంట్స్ నన్ను చూసి చాలా సంతోషిస్తున్నారు.

- శాన్విక, మూడో తరగతి

మార్పును స్పష్టంగా చూడొచ్చు

ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో బ్యాచ్‌కు 20 నుంచి 30 మంది విద్యార్థులకు పది రోజుల పాటు శిక్షణ ఇస్తున్నం. ఈ శిక్షణలో ప్రత్యేకంగా విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచి వారు సాధన చేసినన్ని రోజులు ప్రతి అంశాన్ని గుర్తుంచుకోవడం సాధ్యమయ్యేలా తీర్చిదిద్దుతం. ఈ శిక్షణ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడేలా ఉంటుంది. ఈ శిక్షణ తర్వాత తల్లిదండ్రులు పిల్లల్లో మార్పును స్పష్టంగా చూస్తారు.

- పీ వెంకటేశ్, ట్రైనర్

మానసిక ఒత్తిడి దూరం

రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒక బ్యాచ్‌కు బ్రైటర్ మైండ్స్ శిక్షణ ఇస్తున్నం. మాకు వచ్చే దరఖాస్తులు సంఖ్య ఈ సంవత్సరం ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో మరో రెండో బ్యాచ్‌లను అనుమతించాం. చిన్నారులకు ధ్యానం, వ్యాయామం, యోగా లాంటి కార్యక్రమాలతో వారిలోని మానసిక ఒత్తిడి దూరం చేయడమే మా ముఖ్య ఉద్దేశం.

- సుధాకర్, సెంటర్ కోఆర్డినేటర్, శ్రీరామచంద్ర మిషన్

శిక్షణ చాలా ఉపయోగపడింది..


నేను తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలో వేసవి సెలవుల్లో ఈ శిక్షణకు వచ్చా. ఈ శిక్షణ ద్వారా చాలా విషయాలు నేర్చుకున్న. పదో తరగతి పరీక్షలు కూడా చాలా కాన్ఫిడెంట్‌గా రాయగలిగా. ఈ సంవత్సరం శిక్షణకు వచ్చే విద్యార్థులకు సలహాలు ఇచ్చేందుకు ఇక్కడకు వచ్చా.

- విశ్మయి, పదో తరగతి, అల్ఫోర్స్ హైస్కూల్

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వారికి ఉపశమనం.. వీరికి భారం

- పోలింగ్ కేంద్రాల్లో కూలర్ల ఏర్పాటుకు అంగన్‌వాడీ టీచర్లపై అధికారుల ఒత్తిడి
- ఇండ్లలో నుంచి తేవాలంటూ హుకుం
- అధికారుల తీరుపై బీఎల్వోల ఆగ్రహం

కలెక్టరేట్, మే 12: ఎంకి పెళ్లి సుబ్బిచావుకొచ్చిన చందంగా మారింది ఎన్నికల వేళ అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితి. లోక్‌సభ ఎన్నికల్లో బీఎల్వోలుగా విధులు నిర్వహిస్తున్న వీరి బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఓటర్లకు ఎండవేడి నుంచి ఉపశమనం కల్పించేందుకు చేపట్టిన సౌకర్యాలు వీరికి భారంగా మారుతున్నాయి. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన బాధ్యతను యంత్రాంగం వీరికి అప్పగించింది. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అదనపు సమయం తీసుకునే అవకాశం ఉండడంతో క్యూలైన్లలో వేచి ఉండాల్సి ఉంటుంది. అయితే ఎండలు మండు తుండడంతో ఓటేయక ముందే తిరిగి వెళ్తారనే భావనతో కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. చలవ పందిళ్లు, షామియానాలు వేయడంతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం కూలర్లు కూడా ఏర్పాటు చేయాని నిర్ణయించింది. ఈ బాధ్యతను బీఎల్వోలకు అప్పగించారు. దీంతో వారు కూలర్ల వేటలో పడ్డారు. అద్దెకు ఇచ్చే షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మాత్రమే అద్దెకు దొరకుతుండగా గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కూలర్ల ఏర్పాటు ఇబ్బందిగా మారుతోందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అవసరమైతే ఇండ్లలో నుంచి కూలర్లు తేవాలని ఆదేశిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో విధిలేని పరిస్థితుల్లో తమ ఇండ్లల్లో కూలర్లు లేకున్నా, బంధువులు, మిత్రుల ఇళ్ల నుంచి తెచ్చి కేంద్రాల్లో బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం ముందే సూచించినా, కొందరు అధికారులు పోలింగ్ సమయానికి కూలర్లు తేవాలంటూ ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని టీచర్లు వాపోతున్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మే 12: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 8 వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ బీ భిక్షపతి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

ప్రతిభావంతురాలైన విద్యార్థినికి సన్మానం

ఇందుర్తిలో విద్యార్థిని రిషితను సన్మానిస్తున్న ఇందుర్తి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తదితరులు

చిగురుమామిడి, మే 12 : ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఇందుర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కొమ్మెర రిషిత 10 జీపీఏ సాధించగా ఆదివారం ఇందుర్తి రెడ్డి సంక్షేమ సంఘం, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గునుకుల పల్లె గ్రామానికి చెందిన రిషిత చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినప్పటికీ పట్టుదలతో చదివి మంచి ర్యాంక్ సాధించడంపై అభినందించారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది రాజశేఖర్ రెడ్డి, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి, నాయకులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, కొమ్మెర మహేందర్ రెడ్డి, గునుకుల రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పోతురవేణి లింగం, కూన సంతోష్, చెప్యాల మురళి, కత్తి స్వామి, భరత్, యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

చొప్పదండి, మే 12: పట్టణంలోని తొగురుమామిడి పల్లెకు చెందిన స్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా, అతడి స్నేహితులు అండగా నిలిచారు. చికిత్స కోసం అందరూ కలిసి రూ.56,362 జమ చేసి స్వామికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరేళ్లి చంద్రశేఖర్ గౌడ్, కౌన్సిలర్ కొట్టే అశోక్, మిత్రులు సాంబారి శ్రీనివాస్, పచ్చునూరి తిరుపతి, తాటిపల్లి శివ పాల్గొన్నారు.

మహిళా వాకర్స్‌కు సన్మానం

మదర్స్ డే సందర్భంగా సన్మానం పొందిన మహిళా వాకర్స్

విద్యానగర్, మే 12: నగరంలోని శ్రీ సప్తగిరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా మహిళా వాకర్స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడప కోటేశ్ కుమార్ మాట్లాడుతూ, అమ్మ లేనిదే జన్మ లేదన్నారు. అమ్మ త్యాగాన్ని తలవని రోజు లేదని, ప్రతి పనిలో అమ్మ తన బాధ్యత చాలా గొప్పగా పోషిస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీ సప్తగిరి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడప కోటేశ్ కుమార్, ట్రెజరర్ కనపర్తి రమేశ్, శరత్ పటేల్, నాగరాజ్, మక్బూల్ హుస్సేన్, అనివేని శ్రీనివాస్, శ్రీధర్, సత్యం, నందు, డాక్టర్ లక్ష్మీనారాయణ, సత్తయ్య, శంకరయ్య, ప్రకాశ్‌రెడ్డి, హుస్సేన్, వాకర్స్ పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు

రామడుగు (చొప్పదండి), మే12: రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లె ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలం నరసయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతి (39) శనివారం రాత్రి 11 గంటలకు తన ట్రాక్టర్‌లో కుటుంబ సమేతంగా కొండగట్టులో దైవ దర్శనం కోసం బయలు దేరాడు. రామడుగు మండలం దేశరాజపల్లి ఎక్స్‌రోడ్డు వద్దకు చేరుకోగా, అదే సమయంలో కొండగట్టు వైపు వెళ్తున్న గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పొన్నం ప్రవీణ్ తన కారును అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో వాహనం ట్రాక్టర్ టేలర్ వెనుక వైపు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న మద్దెల తిరుపతి తూలి కింద పడడంతో తల, ఛాతి, ఇతర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. ట్రాక్టర్ ఇరువైపులా కూర్చున్న తిరుపతి బంధువులు కాడే జస్వంత్, విష్ణువర్ధన్‌కు సైతం గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లారు. మద్దెల తిరుపతి చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. జస్వంత్, విష్ణువర్ధన్ చికిత్స పొందుతున్నారు. తిరుపతి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజన్న గోశాలకు వరి గడ్డి వితరణ

మేడిపల్లి, మే 12: మేడిపల్లి మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల లింగయ్య-పావని దంపతులు ఆదివారం వేములవాడ రాజన్న గోశాలకు మూడు ట్రాక్టర్లలో (6 టన్నుల) 291 వరి గడ్డి కట్టలను తీసుకెళ్లి అప్పగించారు. కార్యక్రమంలో లింగయ్య కూతుళ్లు తేజస్విని, మేఘన, చందన, హన్విక తదితరులు పాల్గొన్నారు.